ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com
RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం
సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక
SUPHALA AKSHARAM

TUESDAY 02ND JUNE 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 76 COST : 3\- KHAMMAM, TELANGANA

మంగళవారం 02 జూన్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 76 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## కొనసాగుతున్న ఎండల తీవ్రత

**పలు జిల్లాల్లో గతేడాది కన్నా మిన్నగా ఉష్ణోగ్రతలు**

హైదరాబాద్,జూన్1 రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. రుతపవనాలు జాడ ఇంకాలేదు. ఈ క్రమంలో అనేక జిల్లాల్లో ఎండల తీవ్రత పెరిగింది. నిరుటితో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆదివారం 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ తెలిపింది. 22 జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 45.4 డిగ్రీలు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో సీఎం సమీక్ష

- నీటి వినియోగం తక్కవున్న పంటలపై వివరణ
- పంటల మార్పిడి, వైవిధ్యంపై రైతులకు తెలియచేయాలి
- దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునరుద్దరణ
- అత్యవసర పనుల కోసం వేయికోట్ల నిధులతో పనులు
- వర్షాభావంపై రైతులకు అవగాహన
- స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,జూన్1 వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తక్కువ నీరు వినియోగించుకునే పంటలపై రైతులకు వివరించాలన్నారు. పంట మార్పిడి ప్రాధాన్యాన్ని అన్నదాతలకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నైరుతి రుతుపవనాలతో వచ్చే వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, ఇతర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణలో ప్రాజెక్టుల మెయింటెనెన్స్ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. గేట్లు, నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌కు అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వినియోగించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోమ్, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా రైతులకు వర్షాభావ పరిస్థితులపై ముందస్తు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. అలాగే పంటల మార్పిడి, పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను అన్నదాతలకు వివరించాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల పనులపై కూడా సీఎం ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రాజెక్టుల గేట్లు, ఇతర నిర్వహణ పనులను యుద్ధ

➢ మిగతా 2వ పేజిలో..



## నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు
- ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు

హైదరాబాద్,జూన్1 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నేడు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని మల్కాజ్ గిరి కమిషనరేట్ పోలీసులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మద్యాహ్నం12 గంటల

➢ మిగతా 2వ పేజిలో..

## మద్దతు ధరకు తడిసిన ధాన్యం కొనుగోళ్లు



- ఇప్పటికే 64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట,జూన్1 వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, ధాన్యం కొనుగోళ్ల ప్రగతిని వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా.. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు


➢ మిగతా 2వ పేజిలో..



## తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్

- హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ ఏంటి ?
- తెలంగాణ దిష్టి తగిలిందని ఆనాడు అనలేదా
- బిజెపి ప్రోద్బలంతోనే పవన్ యాక్టింగ్
- మండిపడ్డ మంత్రి పొన్నం

➢ మిగతా 2వ పేజిలో..



## జార్ఖండ్ రాజకీయాలపై చర్చ

- ఖర్గేతో భట్టి భేటీ
- ఢిల్లీలో కీలక సమావేశం
- రాజ్యసభ వ్యూహంపై సమీక్ష

న్యూఢిల్లీ, జూన్ 1 తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జార్ఖండ్‌లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు, రానున్న రాజ్యసభ ఎన్నికలకు సంబంధించిన

➢ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే లక్ష్యం

- ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం
- కవిత ఘాటు వ్యాఖ్యలు
- హామీల అమలుపై డిమాండ్



హైదరాబాద్, జూన్ 1 తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు -- సాధన అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలం గాణ ఉద్యమకారుల సంఘాలు, అమర వీరుల కుటుంబ సభ్యుల సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వం, హక్కుల పరిరక్షణ కోసమే తమ పార్టీ పనిచేస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో అమరవీరులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి న్యాయం జరగలేదని ఆవేదన

➢ మిగతా 2వ పేజిలో..

## సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీలు

- కొలీజియం సిఫార్సులకు ఆమోదం
- కేంద్రం నోటిఫికేషన్ విడుదల
- మహిళా ప్రాతినిధ్యానికి ఊతం



న్యూఢిల్లీ, జూన్ 1 దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త న్యాయమూర్తులను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సోమవారం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని కొలీజియం ఇటీవల సిఫార్సు చేసిన పేర్లకు కేంద్రం ఆమోదం తెలపడంతో ఈ నియామకాలు ఖరారయ్యాయి. కొత్తగా నియమితులైన వారిలో సీనియర్ న్యాయవాది వి మోహన, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, జస్టిస్ షీల్ నాగు, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్, జస్టిస్

➢ మిగతా 2వ పేజిలో..



## ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ఆదివాసీల సొంతింటి కల నెరవేరుస్తున్నాం
- అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్
- నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మహా సిఎంకు తెలంగాణ అంటే చిన్నచూపు
- తుమ్మిడిహట్టి గురించి లేఖ రాస్తే స్పందనేదీ
- జిల్లా పర్యటనలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సిఎం రేవంత్

➢ 2వ పేజిలో..

## వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో సిఎం సమీక్ష

ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టం, పశువుల నష్టం వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే యూరియా మొత్తం తెలంగాణ రైతుల అవసరాల కోసం కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

## తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే లక్ష్యం

వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ఉద్యమం దేశవ్యాప్తంగా ఆదర్శవంతమైన ప్రజా ఉద్యమంగా నిలిచిందని కవిత పేర్కొన్నారు. వంటావార్పు, సకల జనుల సమ్మె వంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణ ఆకాంక్షలను ప్రజల్లోకి తీసుకెళ్లామని చెప్పారు. ఉద్యమ సమయంలో ప్రజల మధ్య విభేదాలు సృష్టించకుండా తమ హక్కుల కోసం పోరాటం చేశామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకులపై, అక్కడి రాజకీయ పరిణామాలపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర రాజకీయాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు సహించరని స్పష్టం చేశారు. తెలంగాణలో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్ ప్రజలతో తమకు ఎలాంటి విభేదాలు లేవని, వారిని గౌరవిస్తామని చెప్పారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చలేదని కవిత విమర్శించారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్ తెలంగాణ నిర్మాణానికి సంబంధించి రైతులు, యువత, సామాజిక న్యాయం అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కవిత పేర్కొన్నారు. రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, సామాజిక తెలంగాణ నిర్మాణం తమ లక్ష్యాలని తెలిపారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిపై ప్రజలు, ఉద్యమకారులు సూచనలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీలు

అరుణ్ పల్లి ఉన్నారు. వీరి నియామకాలతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య మరింత బలపడనుంది. న్యాయవ్యవస్థలో అనుభవజ్ఞులైన వ్యక్తులకు అవకాశం కల్పించడం ద్వారా న్యాయపరమైన వ్యవహారాల పరిష్కారానికి మరింత వేగం చేకూరుతుందని భావిస్తున్నారు. ఈ జాబితాలో వి మోహన ఒక్కరే సీనియర్ న్యాయవాదిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె 1988లో కోయంబత్తూరు న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అయిదేళ్ల న్యాయ విద్యా కోర్సులో తొలి బ్యాచ్ విద్యార్థిగా చదువు పూర్తి చేశారు. అనంతరం ప్రముఖ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్ వద్ద జూనియర్‌గా పనిచేసి విశేష అనుభవాన్ని సంపాదించారు.1996లో అడ్వకేట్ ఆన్ రికార్డ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్వతంత్రంగా న్యాయవాద వృత్తిని కొనసాగించారు. తన సుదీర్ఘ వృత్తి జీవితంలో కపిల్ సిబల్, కేకే వేణుగోపాల్, పి చిదంబరం, అరుణ్ జైట్లీ, అంధ్యార్జున వంటి ప్రముఖ న్యాయవాదులతో కలిసి అనేక కీలక కేసుల్లో వాదనలు వినిపించారు. 2015 ఏప్రిల్ 23న ఆమెకు సీనియర్ న్యాయవాది హోదా లభించింది. వి మోహన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడంతో మహిళా న్యాయమూర్తుల ప్రాతినిధ్యం మరింత బలోపేతమైంది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో మహిళా జడ్జిల సంఖ్య రెండుకు చేరింది. న్యాయవ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెరుగుతున్న సంకేతంగా ఈ పరిణామాన్ని న్యాయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కొత్త న్యాయమూర్తుల నియామకాలతో సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల పరిష్కార ప్రక్రియకు ఊతం లభించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో విభిన్న అనుభవాలు కలిగిన న్యాయమూర్తులు చేరడం వల్ల న్యాయ పరిపాలన మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

## నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు. బేగంపేట, సంగీత్ జంక్షన్, తిరుమలగిరి, బోయిన్ పల్లి వైపు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోలని ఈ సందర్భంగా సూచించారు. రోడ్లపై పార్కింగ్ చేయరాదని చెప్పారు. వేడుకల్లో ప్రభుత్వ కార్యవర్గంతో పాటు తెలంగాణ నలుమూలల నుంచి ప్రజానీకం పాల్గొంటున్న సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలతో పాటు రద్దీ ఎక్కువగా ఉండటంతో.. ప్రయాణీకులు ఆ రూట్లలో మెట్రో ప్రయాణం ఎంచుకోవడం మేలని పోలీసులు సూచించారు. వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే వారు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాటర్ బాటిల్ క్యారీ చేయాలని సలహా ఇచ్చారు.

## జార్ఖండ్ రాజకీయాలపై చర్చ

వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఇటీవల జార్ఖండ్‌లో చేపట్టిన పర్యటన వివరాలను భట్టి విక్రమార్క ఖర్గేకు వివరించారు. అక్కడి రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ పార్టీ పరిస్థితి, కూటమి భాగస్వామ్య పక్షాలతో జరిగిన చర్చలపై సమగ్ర నివేదికను అందించినట్లు సమాచారం. త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో జరిగిన సమావేశం వివరాలను కూడా భట్టి విక్రమార్క వివరించారు. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

కూటమి పార్టీల మధ్య ఐక్యతను పెంపొందించడం ద్వారా రాజ్యసభ ఎన్నికల్లో విజయాన్ని సాధించడమే ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇందుకోసం అన్ని స్థాయిల్లో సమన్వయ చర్యలు కొనసాగుతున్నాయని, కూటమి బలోపేతానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఖర్గేకు వివరించారు. జార్ఖండ్ కాంగ్రెస్ నాయకత్వం కూటమి భాగస్వామ్య పక్షాలతో కలిసి సమిష్టి కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని సమావేశంలో చర్చించినట్లు సమాచారం. ఎన్నికల వ్యూహాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో కూటమి ఐక్యతను కాపాడుతూ ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. పార్టీ బలోపేతం, రాజకీయ సమన్వయం, ఎన్నికల విజయంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు సమాచారం.

# తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్

సిద్దిపేట,జూన్1 ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ 'నవనిర్మాణ సభ' పెడతాననడాన్ని ఆయన ఆక్షేపించారు. భాజపాతో ఒప్పందం మేరకే పవన్ నటన ప్రారంభించారని ఆరోపించారు. తెలంగాణను భాజపాకు తాకట్టు పెట్టడమే ఆయన చెప్పే నవనిర్మాణమా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల దిష్టి తగిలి కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని పవన్ గతంలో అన్నారని.. ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 11 రోజులు అన్నం మానేశానని పవన్ చెప్పారని గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ ముందుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గతంలో మాట్లాడారని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం తినలేదని బహిరంగంగా చెప్పారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణపై విషం కక్కుతూ, తెలంగాణ ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి ఇక్కడ సభ నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అదే రోజున హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలనే ప్రయత్నం జరుగుతోందని, ఇందులో బీజేపీతో పవన్ కళ్యాణ్‌కు లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. తెలంగాణ ప్రజలపై గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వ్యక్తి ఇక్కడికి వచ్చి సభలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. 'తెలంగాణ కళ్ల దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతాయని చెప్పిన పవన్ కళ్యాణ్, తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి' అని వ్యాఖ్యానించారు. అలాగే నవనిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో కాకుండా హైదరాబాద్‌లోనే ఎందుకు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ నాయకత్వాన్ని మెప్పించడానికే తెలంగాణలో సభలు పెడుతున్నారా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని, అక్కడి సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై పోరాడకుండా తెలంగాణలో రాజకీయాలు చేయడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణపై వ్యతిరేక భావజాలంతో వ్యవహరించిన పవన్ కళ్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.

## మద్దతు ధరకు తడిసిన ధాన్యం కొనుగోళ్లు

స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా ఇప్పటివరకు సుమారు 64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విజయవంతంగా సేకరించామని మంత్రి తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని సైతం రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో, ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేసిందని ఆయన స్పష్టం చేశారు. చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. యాసంగిలో మొత్తం భారతదేశం నుంచి కేంద్రానికి అందిన ధాన్యంలో 63 శాతం వాటా ఒక్క తెలంగాణ రాష్ట్రం నుంచే వెళ్లడం మన రైతుల కష్టానికి, ప్రభుత్వ సహకారానికి నిదర్శనమని మంత్రి ఉత్తమ్ కొనియాడారు. అలాగే, గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం అమ్మిన రైతులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా, కేవలం 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు పక్రియను మరింత వేగవంతం చేసి, రాబోయే జూన్ 4వ తేదీ లోపు కొనుగోళ్లన్నింటినీ పూర్తిగా ముగించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఆదిలాబాద్,జూన్1: ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ ఆదివాసీల సొంతింటి కల నెరవేరాలని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేదలకు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగజ్‌నగర్‌లో పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. తండాలు, గూడేల్లో ఉండే అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా. రాష్ట్రంలో సెప్టెంబర్ 17న మరో లక్ష గృహప్రవేశాలు చేస్తాం. కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఈ వేదిక నుంచే మంజూరు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నానని అన్నారు. కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాను. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకంత చిన్నచూపు అని అన్నారు. సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని మరోమారు డిమాండ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని భరిస్తాం. మహారాష్ట్ర నుంచి 2వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నాం అని అన్నారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇండ్లను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కొమురం భీం జిల్లాలో పర్యటించిన సీఎం.. కోలామ్ ఆదివాసీ బిడ్డల ఇందిరమ్మ గృహప్రవేశాలు చేయించారు. కొత్తగూడలో 25 ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాల సందర్భంగా.. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్ల గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. కోలామ్ ఆదివాసీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిన విషయం తెలిసిందే. గృహ ప్రవేశం సందర్భంగా కొత్త ఇందిరమ్మ ఇంట్లో ఆదివాసీలతో కలిసి ఇప్పపువ్వు లడ్డు తిన్నారు సీఎం. గృహ ప్రవేశం సందర్భంగా ఆడబిడ్డలకు పట్టు బట్టలు అందించారు.. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రూ.112.14 కోట్లతో అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. చింతల మానేపల్లిలో 132/3 కేవీ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు.కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 18 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. నియోజవర్గానికి 3 వేల 500 ఇండ్ల చొప్పున మొదటి విడత 4 లక్షల 50 వేల ఇండ్లు ఇచ్చాం అని సిఎం అన్నారు. ఆ లెక్కన ఇస్తే గూడేలలో ఉన్న ఆదివాసీలకు అందరికీ ఇవ్వలేమనే అభ్యర్థన వచ్చిందని, అందుకే ఆదివాసీ ప్రాంతానికి, గూడేలలో ఉన్న ఆదివాసీలు నివసించే

ప్రాంతంలో ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఇచ్చిన 4 లక్షల 500 ఇండ్లు కాకుండా.. గూడేలకు ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా మళ్లీ కొత్త సంకల్పం తీసుకుంటున్నాం. రాష్ట్రం మొత్తంలో ప్రారంభించే ఇండ్లకు ఆదివాసీ ప్రాంతం నుంచే లక్ష ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టామని అన్నారు. మళ్లీ అదనంగా రెండున్నర లక్షల ఇండ్లు ఇచ్చేందుకు ఈ ప్రాంతంనుంచే శ్రీకారం చుడుతున్నాం అన్నారు. లక్షల 50 వేల ఇండ్లకు అదనంగా రెండో విడతలో మరో రెండు లక్షల ఇండ్లు ఇస్తామన్నారు. మొదటి ప్రాధాన్యత ఆదివాసీ గూడేలలో గుడెసెల్లో ఉన్నోళ్లకు, లంబాడీ తండాల్లో ఉన్న గుడిసెల్లో ఉన్న వాళ్లకే ఇండ్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 62లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశాం. మొత్తం 75లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటాం. జూన్ 15 నాటికి ఈ కొనుగోళ్లు పూర్తవుతాయి. మేం సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్రం కొనాలి. దీనికి కిషన్‌రెడ్డి సహకారం అందించాలి. వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధం చేస్తాం అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

## స్వనిధితో వ్యాపారాభివృద్ధి

న్యూఢిల్లీ, జూన్ 1 కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకం దేశవ్యాప్తంగా చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఎలాంటి హామీ అవసరం లేకుండా రుణాలు అందించడం ద్వారా ఈ పథకం లక్షలాది కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకొచ్చింది. 2020లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 1.12 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయి. దేశంలోని నగరాలు, పట్టణాల్లో నివసించే 75 లక్షలకుపైగా లబ్ధిదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 17 వేల 800 కోట్ల రూపాయలకు పైగా రుణాలు పంపిణీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పథకానికి వస్తున్న విశేష ఆదరణను దృష్టిలో ఉంచుకుని దీనిని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ 2030 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. చిన్న వ్యాపారులకు ఆర్థికంగా బలాన్నివ్వడంతో పాటు స్వయం ఉపాధిని ప్రోత్సహించే దిశగా ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోంది. పీఎం స్వనిధి పథకం డిజిటల్ లావాదేవీల విస్తరణలో కూడా విశేష ఫలితాలు సాధించింది. దేశవ్యాప్తంగా 55 లక్షలకుపైగా లబ్ధిదారులు డిజిటల్ వేదికలతో అనుసంధానమయ్యారు. వీరు కలిపి 841 కోట్లకు పైగా డిజిటల్ లావాదేవీలు నిర్వహించగా, వాటి మొత్తం విలువ 8.96 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు అందించిన నగదు ప్రోత్సాహకాలు, వడ్డీ రాయితీల రూపంలో లబ్ధిదారులకు సుమారు 800 కోట్ల రూపాయల ప్రయోజనం లభించింది.ఈ పథకం కింద మూడు దశల్లో ఎలాంటి గ్యారెంటీ లేకుండా 15 వేల రూపాయలు, 25 వేల రూపాయలు, 50 వేల రూపాయల వరకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలు అందిస్తున్నారు. రెండో దశ రుణాన్ని విజయవంతంగా చెల్లించిన వ్యాపారులకు 30 వేల రూపాయల పరిమితితో యూపీఐ అనుసంధానిత రూపే క్రెడిట్ కార్డు అందిస్తున్నారు. అలాగే స్వనిధి సే సమృద్ధి కార్యక్రమం ద్వారా లబ్ధిదారులను పలు కేంద్ర సంక్షేమ పథకాలతో అనుసంధానం చేస్తున్నారు. వ్యాపారుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆహార భద్రత, పరిశుభ్రత అంశాలపై ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తున్నారు. దీనివల్ల వ్యాపార నిర్వహణలో మెరుగైన అవగాహన పెరగడంతో పాటు ఆదాయ వృద్ధికి దోహదపడుతోంది. వ్యాపార కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం లబ్ధిదారుల్లో పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. 2023, 2025 సంవత్సరాల్లో నిర్వహించిన స్వతంత్ర ప్రభావ అంచనా అధ్యయనాల ప్రకారం ఈ పథకం లబ్ధిదారుల వార్షిక ఆదాయం సగటున 20 శాతం మేర పెరిగినట్లు వెల్లడైంది. లబ్ధిదారుల్లో 46 శాతం మంది మహిళలు ఉండటం విశేషం. అలాగే సుమారు 70 శాతం మంది వెనుకబడిన వర్గాలకు చెందినవారు కావడం ఈ పథకం సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహిస్తున్నదని స్పష్టం చేస్తోంది. ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పీఎం స్వనిధి పథకం లక్షలాది వీధి వ్యాపారుల జీవితాల్లో విశేష మార్పు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. నమ్మకం, గౌరవం, సాధికారతకు ప్రతీకగా ఈ పథకం నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు.

## బార్‌లో యువకుల మధ్య గొడవ

### యువతని కారుతో ఢీకొని చంపిన దుండగులు

చెన్నై,జూన్1: ఓ బార్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ 18 ఏళ్ల యువతి ప్రాణం తీసింది. ఈ ఘటన చెన్నై నగరంలో చోటుచేసుకుంది. నిందితులైన బాలమురుగన్ (21), జోశ్వ (19), కిషోర్ కుమార్ (19) లను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలు విల్లుపురం జిల్లాలో నివసిస్తున్న శ్రీలంక శరణార్థి యాన్సీ (18)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విల్లుపూరం జిల్లాలో నివాసం ఉండే యాన్సీ, ఆమె స్నేహితులు చెన్నైలోని ఓ ప్రైవేట్ బార్‌కి వెళ్లారు. అక్కడ యాన్సీ గ్రూప్ డ్యాన్స్ చేస్తుండగా.. అక్కడే ఉన్న మరో పురుషుల బృందం వాగ్వాదం పెట్టుకుంది. చిన్నపాటి గొడవ చిలికి చిలికి పెద్ద ఘర్షణగా మారింది. ఈ క్రమంలోనే బౌన్సర్లు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరు వర్గాలకు సర్ది చెప్పి బయటకు పంపించారు. ఃబార్ బయట వెళ్లిన తర్వాత కూడా వారి మధ్య మరోసారి వివాదం చోటుచేసుకుంది. బౌన్సర్లు కూడా మరోసారి రంగంలోకి దిగి రెండు వర్గాలను అక్కడి నుంచి వెళ్లిపోమని కోరారు. దీంతో యాన్సీ, తన స్నేహితురాలితో కలిసి ద్విచక్ర వాహనంపై తన నివాసానికి బయలుదేరింది. మార్గం మధ్యలో వారి బైక్‌ను ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టారు. అయితే యాన్సీ స్నేహితులు కారుపై రాళ్లు విసరడంతోనే ..వారు ఢీకొట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన యాన్సీ అక్కడికక్కడే మృతి చెందంగా.. ఆమె స్నేహితురాలు తీవ్రంగా గాయపడింది. నిందితులను కఠిన శిక్ష విధించాలని మృతురాలి కుటుంబం కోరింది. 18 ఏళ్లలోపు వారిని బార్‌లోకి అనుమతించినందుకు అధికారులు ఆ ప్రైవేట్ బార్‌ను సీజ్ చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చేపట్టేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు.

## సమాచార హక్కు సాధన కమిటీలో పదోన్నతి జిల్లా ఉపాధ్యక్షుడిగా రంగు మణిదీప్.




హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 01/అక్షరం న్యూస్:-

సమాచార హక్కు చట్టం ప్రచారం ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా సేవలందిస్తున్న యువ సామాజిక కార్యకర్త రంగు మణిదీప్‌కు పదోన్నతి లభించింది. హనుమకొండ జిల్లా సమాచార హక్కు సాధన కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాష్ట్ర కమిటీ ఆయనను నియమించింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మణిదీప్ గతంలో జిల్లా సహాయ కార్యదర్శిగా పనిచేస్తూ సంస్థ విస్తరణ కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ జిల్లా ఉపాధ్యక్ష బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి పదోన్నతి కల్పించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడంతో పాటు సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మణిదీప్‌కు పదోన్నతి లభించడంతో గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్తలు, కమిటీ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## దేవస్థానం సాగు భూముల కౌలుకు బహిరంగ వేలం



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ జూన్ 01/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లాభీమదేవరపల్లిమండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానానికి చెందిన పట్టా భూములను సేద్యం చేసుకునే హక్కు కోసం జూన్ 4 వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కిషన్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు దేవస్థాన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ వేలంపాట జరగనుంది. కొత్తకొండ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 12/2, 28, 29, 35, 37, 39, 40, 42, 95, 97 లలో గల మొత్తం 14 ఎకరాల 4 గుంటల సాగు భూమిని ఒక సంవత్సరం కాల పరిమితికి కౌలుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన రైతులు భక్తులు విధిగా తమ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాళీ చెక్ వెంట తీసుకురావాలి. పాల్గొనే ప్రతి వ్యక్తి ముందుగా భూమి విస్తీర్ణాన్ని బట్టి నిర్ణీత ధరావతు సొమ్ము (రూ. 1000 నుండి రూ. 10,000 వరకు) చెల్లించి వేలంలో పాల్గొనాల్సి ఉంటుంది. వేలం ముగిసిన తర్వాత పాట దక్కించుకోని వారికి ఆ డబ్బు వెనక్కి ఇచ్చేస్తారు. వేలంపాటలో అత్యధిక ధర పాడిన వ్యక్తి అప్పటికప్పుడే డిపాజిట్ పోనూ మిగతా సొమ్ములో 50 శాతం వెంటనే చెల్లించాలి. మిగిలిన మొత్తాన్ని ఆరు నెలల్లోగా చెల్లించేందుకు గాను ఖాళీ చెక్ పై సంతకం చేసి ఇవ్వాలి. లేనిచో పాట రద్దు చేయబడుతుంది. కౌలు కాలంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లినా దానికి పూర్తి బాధ్యత పాటదారునిదే. ఈ వేలాన్ని వాయిదా వేసే లేదా ఎలాంటి కారణం తెలుపక రద్దు చేసే పూర్తి అధికారం కార్యనిర్వహణాధికారికి ఉంటుందని, అలాగే ఈ వేలంపాట దేవాదాయ శాఖ కమిషనర్ ఆమోదానికి లోబడి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు నిర్ణీత సమయానికి వేలంలో పాల్గొనాలని కోరారు.

## ఆర్జీ--3, ఏపీఏ ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే...



రామగిరి, పెద్దపల్లి జిల్లా, జూన్ 1 (అక్షరం న్యూస్):

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం--3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల్లో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసినట్లు రామగుండం--3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలో నిర్వహించనున్న సెంట్రల్ ఫంక్షన్‌కు ఓసీపీ--1 నుండి అడిషనల్ మేనేజర్ బైరి రమేష్, ఏఎల్‌పీ నుండి సూపరింటెండెంట్ ఇంజనీర్ సి.హెచ్. బాలరాజు ఎంపికైనట్లు వెల్లడించారు. వీరిని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. అలాగే ఏరియా స్థాయిలో ఓసీపీ--2 నుండి ఈపీ ఆపరేటర్ తటికంటి శ్రీనివాస్, ఏఎల్‌పీ గని నుండి ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ గాన్ల సురేష్ ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరిని స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో మంగళవారం నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సన్మానించనున్నట్లు తెలిపారు.

# పరిశుభ్రమైన గ్రామంగా ఉంచుకుందాం

- స్వచ్ఛ గావ్ - సురక్షిత జలవాయు ప్రచార కార్యక్రమం
- సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు



రామగిరి (పెదపల్లి జిల్లా) జూన్ 01 అక్షరం న్యూస్ :

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ గావ్ - సురక్షిత జలవాయు (ఎస్.జీ. ఎస్.జే) ప్రచార కార్యక్రమం-2026 అవగాహన సదస్సు జరిగింది. ఇందులో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు - 2016 (ఎస్.డబ్ల్యూ. ఎం 2016) ల అంశంపై సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలపై అవగాహన కల్పించడం జరిగింది.

ఘన వ్యర్థాల సరైన నిర్వహణ, పరిశుభ్రత పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ మరియు ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించిన అంశాలపై వివరించారు.

గ్రామపంచాయతీ సిబ్బంది,ఆరోగ్య సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పరిశుభ్రమైన గ్రామం -- ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తిద్దామన్నారు. శానిటరీ చెత్త, తడి చెత్త, పొడి చెత్త, ప్రత్యేక చెత్త పై అవగాహన కల్పించారు. అలాగే వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు రాబోయే వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధుల నివారణ పై ఆమె చర్చించారు. కాబోయే వర్షాకాలంలో బావులలో మురికి కాల్వల లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, రోడ్లపై మురికి నీరు లేకుండా చూసుకోవాలని సర్పంచ్ కోరారు. దోమల నివారణకు కూడా చర్యలు చేపట్టాలని దీనికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ గంగుల సంతోష్, వార్డు సభ్యులు కెక్కర్ల. ఉషా అశోక్, జక్కుల పద్మాచందన్, కలవేన రవి, ఎం.ఎల్.హెచ్.పి కర్రావుల నవ్య, ఏ.ఎన్.ఎం మన్నాల రాణి,ఆశా వర్కర్ లు అంగూరు విజయలక్ష్మి, మేడ స్వరూప, గడ్డం సునీత, పంజా శాంత,కారోబర్ కొండపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశం

- స్వచ్ఛ గావ్--సురక్షిత జలవాయు కార్యక్రమంపై అవగాహన



రామగిరి, పెద్దపల్లి జిల్లా, జూన్ 1 (అక్షరం న్యూస్):

రామగిరి మండలంలోని బుధవారంపేట గ్రామంలో సోమవారం ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని ఎంపిడిఓ బ్రద్రి శైలజరాణి , గ్రామ సర్పంచ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వచ్ఛ గావ్ -- సురక్షిత జలవాయు (స్ జె స్ జి ) ప్రచార కార్యక్రమం -- 2026 లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు -- 2016 (స్ డబ్ల్యూయూ రూల్స్ 2016) మరియు ఈ అంశంపై గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ కన్నూరి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించగా, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల సరైన నిర్వహణపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గారు, వార్డు సభ్యులు, అఎంసీ డైరెక్టర్, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## ఎన్టీపీసీ హెచ్‌ఆర్ ఏజీఎంను కలిసిన కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 1: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్టీపీసీ హెచ్‌ఆర్ ఏజీఎం గారిని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 1వ డివిజన్ పరిధిలోని పీకే రామయ్య కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యలను ఏజీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, రహదారులు దెబ్బతినడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి ఎన్టీపీసీ యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సంక్షేమం కోసం స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ తెలిపారు

## వడదెబ్బతో వృద్ధుడు మృతి



మహబూబాబాద్ జిల్లా/ గంగారం/ జూన్ 2 (అక్షరం న్యూస్ )

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం లోనికృష్ణానగర్(మడగూడ) పంచాయతీ పరిధిలో వడదెబ్బతో వృద్ధుడు (గామానికి చెందిన సోలం ఎ( రయ్య (55) మృతి చెందాడు సానికులు తెలిపిన వివరాలు (పకారం మృతుడు ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ పనుల నిమిత్తం పోలం వద్ద కు వెళ్లి పోలంలో పంట వ్యర్థాలను తోలగించి సాయంత్రం ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోవడం తో కుటుంబ సభ్యులు అత్యవసర చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరస్తుండగా మార్గ మధ్యలో ఎ(రయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు సోమవారం కృష్ణా నగర్ లో మృతుడికి దహన సంస్కారాలు నిర్వహించారు దీనితో (గామంలో విషాదఛాయలు అలుముకున్నాయి

## సౌర విద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్ట్ కార్మికులకు 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలి

జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 1: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సౌర విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఏఐటియుసి అనుబంధ రామగుండం ప్రాంత ఫ్యాక్టరీ కాంట్రాక్ట్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ కమిటీ చైర్మన్ కు చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రెడ్డపాక లక్ష్మణ్, కార్యదర్శి నాంసాని శంకర్ మాట్లాడుతూ రామగుండం ఎన్టీపీసీ 10 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెలా 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాల చట్టం-2019 ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు నిర్దేశిత గడువులో వేతనాలు చెల్లించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. అయితే కార్మికులకు వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోందని, దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ అయిన బీఏసీ ఎక్విప్‌మెంట్ సంస్థకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ప్రతి నెలా 7వ తేదీలోపు వేతనాలు చెల్లించేలా ఎన్టీపీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి. సత్యనారాయణ, బి. అర్జున్, శివపాల్ సింగ్, సాంబయ్య తదితర కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## అడ్రియాల గని ఎస్సీ--ఎస్టీ ఉద్యోగస్తుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన పిట్ సెక్రటరీగా జనగామ రమేష్ నియామకం



రామగిరి, పెద్దపల్లి జిల్లా, జూన్ 1 (అక్షరం న్యూస్):

సింగరేణి కాలరీస్ ఎస్సీ--ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేంద్ర కమిటీ, ఏ పి ఏ జనరల్ బాడీ సమావేశంలో అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ నూతన పిట్ సెక్రటరీగా జనగామ రమేష్ ని నియమించారు. సోమవారం జరిగిన ఈ సమావేశానికి సంఘం వైస్ ప్రెసిడెంట్ బత్తుల శంకర్ అధ్యక్షత వహించగా, బ్రాంచి కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేయాలనే లక్ష్యంతో జనగామ రమేష్ కి బాధ్యతలు అప్పగించారు. నూతనంగా పిట్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన జనగామ రమేష్ కి దాసరి మల్లేష్ , శంకర్ దయాల్ శర్మ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమం, సంఘ బలోపేతానికి కలిసి పనిచేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## సి ఎం ఆర్ఎఫ్ పేదలకు వరం...



మహబూబాబాద్ జిల్లా/ గంగారం/ జూన్ 1(అక్షరం న్యూస్ ) గంగారం మండలం లోని

ముఖ్యమంత్రి సహాయ నిధి (సి ఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క గారి ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు భూక్య ఉమా గారి సూచనల మేరకు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు గారి ఆధ్వర్యంలో

గంగారం మండలంలో దుబ్బగూడెం గ్రామానికి చెందిన గోపు భరత్ కు 35000/ రూపాయల చెక్కును పోనుగొండ్ల గ్రామానికి చెందిన పే రామ్ చరణ్ తేజ కు 60000/ రూపాయలు విలువ గల చెక్కులను లబ్ధిదారులకు మండల కాంగ్రెస్ పార్టీ బృందం పంపిణీ చేశారుఈ కార్యక్రమంలో సర్పంచ్ ముడిగే వీరభద్ర పోతయ్య, గుంట రామారావు, జెజ్జరి రాము పూనెం సంధ్య సందీప్, పార్టీ అధికార ప్రతినిధి బూర్కా యాదగిరి, మండల నాయకులు శ్రీను యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈసం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు...

## లాడ్జీలు,రెస్టారెంట్లు, వైన్ షాపులు, బస్టాండ్ పరిసరాల్లో ఆకస్మిక తనిఖీలు

- **గంజాయి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పోలీసుల ప్రత్యేక డ్రైవ్**



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గోదావరిఖని-1 టౌన్ పోలీసులు,పోలీస్ యాంటీ నార్కోటిక్స్ వింగ్,నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సంయుక్త ఆధ్వర్యంలో గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడంతో పాటు ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా గోదావరిఖని బస్టాండ్, పాన్ షాపులు, స్మోకింగ్ జోన్లు,వైన్ షాపులు,రెస్టారెంట్లు, లాడ్జీలు,ఐబీ కాలనీ పరిసరాలు,ఆటో స్టాండ్లు,టీ స్టాళ్లు తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికుల సామగ్రి, అనుమానాస్పద ప్రాంతాలు,అలాగే ప్రజలు అధికంగా సంచరించే ప్రదేశాలను ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గోదావరిఖని-1 టౌన్ ఎస్ఐ శ్రీ రమేష్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

## అఖిల భారత రైతు-కూలీ సంఘ(ఏ.ఐ.కే.ఎం.ఎస్) జిల్లా కమిటీ ఎన్నిక గుండేటి మల్లేశం, కొల్లూరి మల్లేశంలు ఎన్నిక



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

అంతర్గాం మండలం, పెద్దంపేట్ లో జరిగిన "ఏ.ఐ.కే.ఎం.ఎస్" పెద్దపెల్లి జిల్లా 4వ మహాసభల్లో 9 మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారురాబోవు 3 సంవత్సరాలకు గాను రైతాంగ సమస్యలు పరిష్కారంకై, సంఘం పటిష్టత కోసం, ఏ.ఐ.కే.ఎం.ఎస్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులుగా గుండేటి మల్లేశం (గోదావరిఖని), ఉపాధ్యక్షులుగా మేరుగు చంద్రయ్య (పెద్దంపేట్), ప్రధాన కార్యదర్శిగా కొల్లూరి మల్లేశం (బ్రాహ్మణపల్లి), సహాయ కార్యదర్శిగా దోనూరి రాజమౌళి (ధర్మారం), కోశాధికారిగా ఇరుగురాల రాజేశం (గోదావరిఖని) కార్యవర్గ సభ్యులుగా కాదాసి లింగమూర్తి (పెద్దపల్లి), గుండు రాజయ్య (మల్కాపురం), ఎల్ శంకర్ (మద్దిర్యాల) తోపాటు ఒకరిని కో ఆప్షన్ గా ఎన్నుకోవడం జరిగింది, ఈ నూతన జిల్లా కార్యవర్గంతో ఏ.ఐ.కే.ఎం.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న ప్రమాణ స్వీకారం చేయించారు.

**తీర్మానాలు:-**

స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుపరిచి రైతు పంటలకు కనీస మద్దతు ధర(ఎం.ఎస్.పి) చెల్లించాలి.

నూతన విద్యుత్ విత్తన చట్టం 2025 ను రద్దు చేయాలి.

ఉపాధి కూలీల కోసం చేసిన విభి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి.

విత్తనాల కొరతను మరియు కల్తీని నివారించి ధరలను నియంత్రణలో ఉంచాలి.

పెంచిన గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలి.

దళారులను కట్టడి చేసి ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా రైతు పెట్టుబడికి తగిన నిధులను అందజేయాలని తీర్మానించింది.

## పార్థివ దేహానికి పులుమల వేసి నివాళ్లు అర్పించిన ములుగు నియోజకవర్గ BRS పార్టీ ఇంచార్జి మాజీ జెడ్పీ చైర్మన్ శ్రీమతి బడే నాగజ్యోతి



మహబూబాబాద్ జిల్లా/ గంగారం/ జూన్ 2(అక్షరం న్యూస్ )

ములుగు నియోజకవర్గం గంగారం మండలం మామిడి గూడెం గ్రామానికి చెందిన ఈసం రణధీర్ గారు ఈ రోజు మరణించగా నర్సంపేట లో పోస్ట్ మార్టం జరగగా అక్కడికి వెళ్లి పూల మాల వేసి నివాళ్లు అర్పించిన ములుగు నియోజకవర్గ BRS పార్టీ ఇంచార్జి బడే నాగజ్యోతి ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఈసం సమ్మయ్య మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి అజ్మీరా రమేష్ కాసర్ల సాంబయ్య దీ=హా౦ నాయకులు కొనుకటీ ప్రశాంత్ కొమరం సిద్దు అరిచేర్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలి

- **సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం**



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి, ప్రతి నెలా గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా చెల్లించాలని గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘం (సీఐటీయూ) డిమాండ్ చేసింది. అలాగే బహుళ విధుల కార్మికుల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవీందర్, సీఐటీయూ మండల కన్వీనర్ అడారి నర్సింగరావు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లిస్తామని, బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం స్వాగతించదగ్గ విషయమన్నారు. అయితే పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.గ్రామ పంచాయతీ కార్మికులందరికీ వేతనాలు పెంచి, ప్రతి నెల మొదటి తేదీనే గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సిబ్బంది అందరినీ రెండో వేతన సవరణ సంఘం (పీఆర్సీ) పరిధిలోకి తీసుకువచ్చి వేతన సవరణలు అమలు చేయాలన్నారు.కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్న జీవో నెం.51ను సవరించాలని, బహుళ విధుల కార్మికుల విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీలను కొనసాగించాలని కోరారు. సాంకేతిక కారణాలతో ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల వివరాలను వెంటనే నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామ పంచాయతీల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కారోబార్‌లు, బిల్లు వసూలుదారులకు ప్రత్యేక హోదా కల్పించాలని, క్షేత్రస్థాయిలో కార్మికులను అక్రమంగా తొలగిస్తూ మానసిక వేధింపులకు గురిచేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదకర విధుల్లో పనిచేసే కార్మికులందరికీ ప్రభుత్వ వ్యయంతో ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు పసుల భీమయ్య, నాయకులు తమ్మనవేని శంకర్, దుర్గం శంకర్, బాణాల రాజేష్, వారా శ్యామ్, కండ్లె ముండయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల పరిరక్షణకు ఏఐసీడబ్ల్యూఎఫ్ సమావేశాలను విజయవంతం చేయాలి

- **ఏఐసీడబ్ల్యూఎఫ్ కార్యవర్గ సమావేశాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ**
- **తుమ్మల రాజారెడ్డి, ఎస్‌సీఈయూ--సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: కార్మిక హక్కుల పరిరక్షణ, బొగ్గు పరిశ్రమ అభివృద్ధి, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ లక్ష్యాలతో ఈ నెల 13, 14 తేదీలలో గోదావరిఖనిలో నిర్వహించనున్న అఖిల భారత బొగ్గు కార్మిక సమాఖ్య (ఏఐసీడబ్ల్యూఎఫ్) కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్‌సీఈయూ--సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు.

సోమవారం ఉదయం ఓసీపీ-5లో, అనంతరం ఏరియా వర్క్‌షాప్‌లో పిట్ కార్యదర్శి ఈద వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన గేటు సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బొగ్గు గని కార్మికులకు 2026 జూలై నెల నుంచి అమలులోకి రావాల్సిన 12వ వేతన ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం ఇప్పటివరకు సంయుక్త ద్వైపాక్షిక వేతన చర్చల కమిటీని కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. వెంటనే కమిటీని ఏర్పాటు చేసి వేతన ఒప్పందంపై చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక చట్టాల సంకలనాలు (లేబర్ కోడ్లు), కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల అణచివేత ధోరణులు కార్మిక వర్గ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణలోని కొత్త బొగ్గు గనుల బ్లాకులను వేలం విధానం ద్వారా ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ రంగ బొగ్గు పరిశ్రమను కాపాడుకోవాలంటే దేశవ్యాప్తంగా ఇంధన రంగ కార్మికులు ఐక్యంగా ఉద్యమాలు, సమ్మెలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. బొగ్గు పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మికుల హక్కులు, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కార్యవర్గ సమావేశాల్లో విస్తృతంగా చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాలను రూపొందిస్తామని తెలిపారు.

## వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

- **ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం**



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నియోజకవర్గంలోని బసంత్ నగర్, పాలకుర్తి, కొత్తపల్లి, రామారావుపల్లి, గోలివాడ గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో సోమవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం గడపడానికి ఇలాంటి సంక్షేమ పథకాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో అనేక కుటుంబాలు శాశ్వత నివాస సౌకర్యాన్ని పొందుతున్నాయని, భవిష్యత్తులో కూడా ప్రజా సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాజమండ్రిలో జరిగే ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు 'మేజిక్ రాజా'కు ఆహ్వానం



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ప్రముఖ ఇంద్రజాలికుడు, కవి, కళాకారుడు, వ్యాఖ్యాత, వెంట్రిలాక్విస్ట్, బహుముఖ ప్రజ్ఞాశాలి మేజిక్ రాజాకు 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో జూన్ 6, 7 తేదీల్లో ఈ మహాసభలు జరుగనున్నాయి. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, సాంప్రదాయాలు, కళలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పే అక్షర మహోత్సవంగా ఈ సభలు రూపుదిద్దుకుంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ మహాసభల్లో దేశ, విదేశాల నుండి సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు, భాషాభిమానులు పాల్గొననున్నారని, తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మహోత్సవంగా ఇది అవతరించనుందని పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా అత్యంత వైభవంగా జరగనున్న ఈ మహాసభల్లో కవితా పఠనం, ఇంద్రజాలం, మిమిక్రీ, వెంట్రిలాక్విజం ప్రదర్శనల విభాగాల్లో పాల్గొనాలని నిర్వాహకులు, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీ భూషణం, జాతీయ ప్రణాళికా అధికారి డా. టి.పార్థసారథి మేజిక్ రాజాను ఆహ్వానించారు. ఈ మేరకు రాజాకు డిజిటల్ ఆహ్వాన పత్రిక పంపించారు.

## ప్రేమించాడు.. పెళ్లికి మాత్రం నో'.. ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి మౌన పోరాటం

- **పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి ఇప్పుడు మాట మార్చాడంటూ ఓ యువతి ప్రియుడి ఇంటి ముందు మౌన పోరాటానికి దిగిన ఘటన పొగుళ్లపల్లి గ్రామంలో కలకలం రేపింది.**



మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ జూన్ 2 (అక్షరం న్యూస్ )

కొత్తగూడ మండలం లో ప్రేమ పేరుతో తనను నమ్మించి, పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి ఇప్పుడు మాట మార్చాడంటూ ఓ యువతి ప్రియుడి ఇంటి ముందు మౌన పోరాటానికి దిగిన ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి గ్రామంలో సోమవారం కలకలం రేపింది. పోగులపల్లి గ్రామానికి చెందిన బాధితురాలు భైరబోయిన మనీషా తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన జూల వంశీతో గత రెండేళ్లుగా ప్రేమ వ్యవహారం కొనసాగింది. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతో సన్నిహితంగా ఉన్నాడని, అయితే ఇటీవల పెళ్లి విషయం ప్రస్తావించగా నిరాకరిస్తున్నాడని ఆరోపించింది. ప్రేమించినప్పుడు ఇచ్చిన హామీలను ఇప్పుడు విస్మరించి తనను మోసం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తూ నేరుగా ప్రియుడి ఇంటి వద్దకు చేరుకున్న యువతి, తనకు న్యాయం జరిగే వరకు అక్కడి నుంచి వెళ్లబోనని చెబుతూ మౌన దీక్ష చేపట్టింది.విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోగా, ఘటన గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. యువతి ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజ్‌కుమార్ యువతితో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. చట్టపరంగా విచారణ చేపట్టి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఎవరికీ అన్యాయం జరగకుండా కేసును పరిశీలిస్తామని ఎస్సై హామీతో యువతి తన మౌన పోరాటాన్ని తాత్కాలికంగా విరమించినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారంపై గ్రామస్థులు, బంధువుల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ప్రేమ కథకు ఎలాంటి ముగింపు లభిస్తుందనే ఉత్కంఠ స్థానికంగా నెలకొంది.

## హనుమకొండకు బదిలీ అయిన పశువైద్య అధికారిణి డాక్టర్ మాలతికి ఆత్మీయ వీడ్కోలు



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 01/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్ర పశువైద్యశాలలో గత ఎనిమిది సంవత్సరాలుగా పశువైద్య అధికారిణిగా సేవలందించిన డాక్టర్ మాలతికి హనుమకొండకు బదిలీ కావడంతో సోమవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పూరు గ్రామ సర్పంచ్ గద్ద కుమారస్వామి, ఉపసర్పంచ్ మిరియాల రాణిరాజు, రైతులు, ప్రజాప్రతినిధులు కలిసి డాక్టర్ మాలతిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ఆమె అందించిన విశేష సేవలను కొనియాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పశువైద్య సేవలను సమర్థవంతంగా అందించారని ప్రశంసించారు. మండలంలోని పశుపోషక రైతుల సమస్యల పరిష్కారంలో ఆమె కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. డాక్టర్ మాలతి మాట్లాడుతూ, భీమదేవరపల్లి మండల రైతులు, ప్రజాప్రతినిధులు, శాఖ సిబ్బంది తనకు అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని అన్నారు. ఇక్కడ పనిచేసిన కాలం తన వృత్తి జీవితంలో ఎంతో సంతృప్తిని, మంచి అనుభవాలను అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొని డాక్టర్ మాలతికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎస్.సి సెల్ చైర్మన్ నియామక పత్రాన్ని అందుకున్న పైడిమల్ల నర్సింగ్



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూన్ 1/అక్షరం న్యూస్ -:


హైదరాబాద్ టూరిస్ట్ ప్లాజా హోటల్ బేగంపేట్ లో సోమవారం నిర్వహించిన ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ మరియు నూతనంగా ఎన్నుకోబడ్డ జిల్లా చైర్మన్ ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర ఎస్.సి సెల్ రాష్ట్ర చైర్మన్, మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా ఇటీవల ఎస్.సి సెల్ మంచిర్యాల జిల్లా చైర్మన్ నియమితులైన పైడిమల్ల నర్సింగ్ నియామక పత్రం అందుకున్నారు.

## బెల్ట్ షాపుల మూసివేతకు గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానం

- **గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం..సర్పంచ్ మాచర్ల కుమారస్వామి..**

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 01/అక్షరం న్యూస్:-

గ్రామ ప్రజల ఆరోగ్యం కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని భీమదేవరపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో గ్రామ పరిధిలో కొనసాగుతున్న బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల కుమారస్వామి మాట్లాడుతూ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల కారణంగా యువత మద్యం వ్యసనానికి గురవుతూ కుటుంబాలు ఆర్థిక సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం, యువతను మంచి మార్గంలో నడిపించడం ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని తెలిపారు. బెల్ట్ షాపుల నిర్మూలనకు ప్రజలు, అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఉప సర్పంచ్ శనిగరం అయిలయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు ప్రేమలత, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, పోలు అశోక్, సాగంటి వెంకటేశ్వర్లు, బొల్లంపల్లి శ్యామ్, విజయ, సంధ్య తదితరులు పాల్గొన్నారు. పాలకవర్గం తీసుకున్న ఈ నిర్ణయాన్ని గ్రామ ప్రజలు స్వాగతిస్తున్నట్లు తెలిపారు.







# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై నిషేధాజ్ఞల కొనసాగింపు ..

- **అనుమతి లేని డ్రోన్లు, డీజే సౌండ్స్‌పై కఠిన చర్యలులి**
- **రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సాధారణ పౌరులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల,పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం మత్తులో వీధులు, రహదారులపై అసభ్య పదజాలంతో ప్రవర్తించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు 01-06-2026 నుండి 01-07-2026 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం,1348 ఫసలీ నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### డీజే సౌండ్స్, డ్రోన్లపై నిషేధాజ్ఞల పొడిగింపు

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల,పెద్దపల్లి జోన్‌లలో డీజే సౌండ్స్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు భారీ శబ్దంతో కూడిన డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధం విధించినట్లు తెలిపారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజలను సమీకరించేందుకు డీజే సౌండ్స్ వినియోగిస్తున్నట్లు గమనించామని పేర్కొన్నారు. అయితే, కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మైక్ సెట్ వినియోగానికి సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు కూడా 01-06-2026 నుండి 01-07-2026 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం,1348 ఫసలీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్--2016లోని సెక్షన్ 7(1),సెక్షన్ 22(1)(ఖ) నుండి(ట), సెక్షన్ 22(2)(ఖ),(ఎ), సెక్షన్ 22(3),సిటీ పోలీస్ యాక్ట్ 1348 నం. ×శ ఫసలీ,సెక్షన్ 30,పోలీస్ యాక్ట్--1861 ప్రకారం 01-06-2026 ఉదయం 6.00 గంటల నుండి 01-07-2026 ఉదయం 6.00 గంటల వరకు అమల్లో ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కాలంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, నిరసనలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బంద్‌ల పేరిట సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, ఒత్తిడి చేయడం లేదా బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

# స్మశాన వాటికకు కనీస వసతులు, కాలనీలకు సీసీ రోడ్లు కావాలి

- **ఆంజనేయులు సాగర్**



శేరిలింగంపల్లి పట్టణం అక్షరం ప్రతినిధి జూన్ 1: అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ స్మశాన వాటిక అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించడంతో పాటు, డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ డిమాండ్ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ శ్రీ లక్ష్మీ కి వినతిపత్రం అందజేసి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాజీవ్ నగర్ స్మశాన వాటిక ప్రస్తుతం దయనీయ స్థితిలో ఉందని, అక్కడ చెత్త పేరుకుపోవడం, పొదలు, చెట్లు విపరీతంగా పెరగడం వల్ల ప్రజలు అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంతేకాకుండా స్మశాన వాటికలో కనీస వసతులైన వీధి దీపాలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేకపోవడం వల్ల రాజీవ్ నగర్, పరిసర ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని బంజారా బస్తీ, రాజీవ్ నగర్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు దెబ్బతిని ప్రజలకు ఇబ్బందికరంగా మారాయని తెలిపారు. ఈ రహదారులు ప్రధాన రహదారులతో అనుసంధానమై ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు, ఉద్యోగులు, వాహనదారులు ప్రయాణిస్తున్నారని చెప్పారు. వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగిపొర్లి రోడ్లపైకి నీరు చేరడం, ఇప్పటికే రోడ్లు అధ్వాన్నంగా ఉండటం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా వెంటనే సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులను కోరారు. వినతిపై సానుకూలంగా స్పందించిన చీఫ్ ఇంజినీర్ శ్రీ లక్ష్మీ సమస్యలను పరిశీలించి త్వరలోనే తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ సాగర్, వెంకటేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# మే నెలలో 1.07 లక్షల మెట్రిక్ టన్నుల
# యూరియా ఉత్పత్తి సాధించిన ఆర్ఎఫ్‌సీఎల్




జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) యూనిట్ హెడ్ ఎస్.కె. జిందాల్ మే-2026 నెల ఉత్పత్తి వివరాలను ప్రకటించారు.

ఆర్ఎఫ్‌సీఎల్ అనేది నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్), ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్) మరియు ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎఫ్‌సీఐఎల్) సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పడిన సంస్థ. ఇందులో ఎన్ఎఫ్ఎల్, ఈఐఎల్ సంస్థలకు తలా 26 శాతం వాటా ఉండగా, ఎఫ్‌సీఐఎల్‌కు 11 శాతం వాటా ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా 11 శాతం ఉంది. రోజు 3850 టన్నుల యూరియా ఉత్పత్తి జరుగుతుంది.

ప్రస్తుతం ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి అవుతున్న వేపపూత యూరియాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు.

మే-2026 నెలలో ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్‌లో మొత్తం 1,07,883.45 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేశారు. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి 64,299.15 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 8,175.15 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 11,305.26 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 7,900.47 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 8,291.07 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్‌కు 7,912.35 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా యూనిట్ హెడ్ శ్రీ ఎస్.కె. జిందాల్ మాట్లాడుతూ, మే నెలలో 1.07 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి లక్ష్యాన్ని విజయవంతంగా సాధించడంలో కీలక పాత్ర పోషించిన కార్మికులు, ఉద్యోగులు, అధికారులు మరియు సాంకేతిక సిబ్బంది ని అభినందించారు. అలాగే సంస్థ అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర ఎరువులు మరియు రసాయనాల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఇతర సంబంధిత అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దేశ ఆహార భద్రతకు అవసరమైన ఎరువుల ఉత్పత్తిలో ఆర్ఎఫ్‌సీఎల్ కీలక పాత్ర పోషిస్తూ, రైతాంగానికి నాణ్యమైన వేపపూత యూరియాను నిరంతరం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

- మాజీ సర్పంచుల అరెస్టులు దారుణం
- అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరు
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య

చిగురుమామిడి; జూన్ 01, అక్షరం న్యూస్

గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నివాస ముట్టడికి వెళ్లేందుకు ప్రయత్నించిన మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్లలో నిర్బంధించడం దారుణమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెల్లవారుజామునే చిగురుమామిడి సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జక్కుల రవీందర్‌తో పాటు మాజీ సర్పంచులు బోయిని శ్రీనివాస్, బెజ్జంకి లక్ష్మణ్, ముప్పిడి నరసింహారెడ్డి తదితరులను అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు. తమ పదవీకాలంలో గ్రామాభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేపట్టి పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు బిల్లులు చెల్లించకపోవడంతో మాజీ



సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసేందుకు వెళ్తున్న వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో సర్పంచుల ఉద్యమాన్ని అణచివేయలేరని, వారికి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికలకు ముందు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ సర్పంచులు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. మాజీ సర్పంచుల పదవీకాలం ముగిసి దాదాపు 32 నెలలు గడిచినా బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జక్కుల రవీందర్ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అప్పులు చేశామని, బిల్లులు విడుదల కాకపోవడంతో వడ్డీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు.

## ప్రారంభమైన ప్రత్యేక భద్రత అవగాహన వారోత్సవాలు



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూన్ 1/ అక్షరం న్యూస్ –:

మందమర్రి ఏరియాలో ఘనంగా ప్రారంభమైన ప్రత్యేక భద్రతా అవగాహన వారోత్సవాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. కేకేఓసీపీ లో కార్మికులకు జీఎం ఎన్. రాధాకృష్ణ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

సింగరేణి కార్పొరేట్ సేఫ్టీ విభాగం ఆదేశాల మేరకు మందమర్రి ఏరియాలో ప్రత్యేక భద్రతా అవగాహన వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 1 నుండి 6 వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ (జీ.ఎం) ఎన్. రాధాకృష్ణ నేడు కేకేఓసీపీ ప్రాజెక్టును సందర్శించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓబీ ఆఫ్ లోడింగ్ కార్మికులను ఉద్దేశించి ఆయన భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సంస్థ నిర్దేశించిన భద్రతా నిబంధనలను, సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భద్రత పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన వైఖరిని కలిగి ఉండాలని, సింగరేణిలో సురక్షితమైన పని వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఇంచార్జి ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, మేనేజర్ రామరాజు, ఇంచార్జి ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ పైడయ్య, ఎక్స్‌ప్రెస్‌వే జీఎం దినేష్ చౌదరి మరియు పెద్ద సంఖ్యలో సింగరేణి అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
- టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు: డాక్టర్ బాలు



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/జూన్ 1/అక్షరం న్యూస్:

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండిం గ్ లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయాలను కాంగ్రెస్ ప్రభుత్వంవెంటనే విడుదల చేయా లని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు డా క్టర్ బాలు డిమాండ్ చేశారు. సోమవారం అక్షరం ప్రతినిధితో చరవాణిలో మాట్లాడు తూ విద్యార్థులు వివిధ కోర్సులను పూర్తి చేసుకున్నప్పటికీ వారి యొక్క సర్టిఫికెట్లను కళాశాలల నుండి విద్యార్థులు తీసుకోలేన టువంటి దుస్థితి రాష్ట్రంలో నెలకొని ఉన్న దని అన్నారు. కాంట్రాక్టర్ల మీద ఉన్న శ్రద్ధ వి ద్యార్థుల పైన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, ప్రజా ప్రభుత్వం అని చెబుతూనే విద్యార్థు ల జీవితాలను నాశనం చేస్తున్నదని గత ప్ర భుత్వం అనుసరించిన విద్యార్థివ్యతిరేక వి ధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించ డం సరికాదని అన్నారు. రాష్ట్రవ్యా ప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను వెం టనే విడుదల చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని, లేని ఎడల విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే రాష్ట్రవ్యాప్తంగా టీఎన్ఎ స్ఎఫ్ ఆందోళనకు సిద్ధమవుతుందని తెలి పారు. విద్యార్థులు నిరుద్యోగులను మోసం చేసినందుకే బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్ని కల్లో ప్రజలుగుణపాఠం చెప్పారని మరొక సారి అదే పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి తప్పదని ఆయన హెచ్చరించారు.

## విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
- టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు: డాక్టర్ బాలు



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/జూన్ 1/అక్షరం న్యూస్:

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండిం గ్ లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయాలను కాంగ్రెస్ ప్రభుత్వంవెంటనే విడుదల చేయా లని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు డా క్టర్ బాలు డిమాండ్ చేశారు. సోమవారం అక్షరం ప్రతినిధితో చరవాణిలో మాట్లాడు తూ విద్యార్థులు వివిధ కోర్సులను పూర్తి చేసుకున్నప్పటికీ వారి యొక్క సర్టిఫికెట్లను కళాశాలల నుండి విద్యార్థులు తీసుకోలేన టువంటి దుస్థితి రాష్ట్రంలో నెలకొని ఉన్న దని అన్నారు. కాంట్రాక్టర్ల మీద ఉన్న శ్రద్ధ వి ద్యార్థుల పైన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, ప్రజా ప్రభుత్వం అని చెబుతూనే విద్యార్థు ల జీవితాలను నాశనం చేస్తున్నదని గత ప్ర భుత్వం అనుసరించిన విద్యార్థివ్యతిరేక వి ధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించ డం సరికాదని అన్నారు. రాష్ట్రవ్యా ప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను వెం టనే విడుదల చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని, లేని ఎడల విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే రాష్ట్రవ్యాప్తంగా టీఎన్ఎ స్ఎఫ్ ఆందోళనకు సిద్ధమవుతుందని తెలి పారు. విద్యార్థులు నిరుద్యోగులను మోసం చేసినందుకే బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్ని కల్లో ప్రజలుగుణపాఠం చెప్పారని మరొక సారి అదే పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి తప్పదని ఆయన హెచ్చరించారు.

## అర్ధరాత్రి రోడ్లపై హద్దుమీరి ప్రవర్తించిన యువకులపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు...

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ జూన్ 1 (అక్షరం న్యూస్)

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ ట్రోఫీ గెలుచుకున్న ఆనందంలో ఖమ్మం నగరంలో అర్ధరాత్రి రోడ్లపై హద్దుమీరి ప్రవర్తించిన యువకులపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకునట్లు టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. గత రాత్రి ఖమ్మం జడ్పీ సెంటర్లో కొంతమంది యువకులు రోడ్లపైకి వచ్చి మోటార్ సైకిల్ పై త్రిబుల్ రైడింగ్, విన్యాసాలు చేస్తూ చక్కర్లు కొడుతూ సైలెన్సర్ల మోతతో రోడ్లపై వెళ్లే ప్రజలకు, వాహనదారులకు అసౌకర్యం కలిగించి టపాసులు కాలుస్తూ ప్రజలకు భయాందోళన గురి చేసిన ఏడుగురు యువకుల పై సిటీ పోలీస్ పబ్లిక్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి ఐదు మోటర్ సైకిల్ లను సీజ్ చేసినట్లు తెలిపారు. పుట్టినరోజు పేరిట, పార్టీలు చేసుకుంటూ అర్ధరాత్రి సమయాల్లో నగరంలో తాగి రోడ్లపై ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే కేసులు నమోదు చేయడం తప్పవని అన్నారు. చదువుకునే యువత కేసుల్లో ఇరుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలు రాకుండా పోతాయని, తల్లిదండ్రులు కూడా పిల్లల్ని రాత్రి పది గంటల తర్వాత బైక్ లు ఇచ్చి బయటకు పంపవద్దని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మైనర్ యువకులకు 2 వీలర్స్ ఇస్తే తండ్రి లేదా వాహన యజమాని పై కేసులు నమోదు అవుతాయని ఇన్స్పెక్టర్ తెలిపారు.

## జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీ కల్పించాలి

- టీఎస్ జేయూ జిల్లా అధ్యక్షుడు గట్టు మహేష్.
- పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం.
- సానుకూలంగా స్పందించిన డీఈఓ.



పెద్దపల్లి జిల్లా/ పెద్దపల్లి టౌన్ / జూన్ 01 / అక్షరం న్యూస్ –:

సమాజ శ్రేయస్సు కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టుల పిల్లల చదువులకు ప్రభుత్వం, విద్యాశాఖ అండగా నిలవాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ టీఎస్ జేయూ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గట్టు మహేష్ జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు. సోమవారం పెద్దపల్లి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) జి. శారద ని కలసి, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల్లో రాయితీ కల్పించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ. నిరంతరం వార్తల సేకరణలో ఉంటూ సమాజ చైతన్యానికి తోడ్పడే జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అంతంతమాత్రంగానే ఉందన్నారు. ముఖ్యంగా కోవిడ్ తదనంతర పరిస్థితుల్లో, పెరిగిన నిత్యావసరాల ధరలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు భారీగా పెరగడం వల్ల జర్నలిస్టులు తమ పిల్లలను చదివించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

?అక్రమ ఫీజుల దోపిడీని అరికట్టడంతో పాటు, వర్కింగ్ జర్నలిస్టుల పిల్లల స్కూల్ ఫీజుల్లో కనీసం 50 శాతం రాయితీ ఇచ్చేలా ప్రైవేట్ యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని వారు డీఈఓను కోరారు. ?ఈ వినతిపై డీఈఓ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అవునూరి సంపత్ తో పాటు సభ్యులు సాయి వంశీ, సురేష్, సతీష్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు

## పురాతన ఆలయాల అభివృద్ధి చరిత్రలను వెలికితీయడం పూర్వజన్మ సుకృతం

- ఛత్రపతి శివాజీ యువసేన భాగ్యనగర్ అధ్యక్షులు బైలుర యోగేష్ ప్రభు.



రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :జూన్ 1: అక్షరం న్యూస్ –:

సనాతన ధర్మం పురాతన ఆలయాల అభివృద్ధి వాటి చరిత్రలను భావితరానికి చూపుతున్న నరేష్ కుమార్ సేవలు అభినందనీయమని భాగ్యనగర్ చత్రపతి శివాజీ మహారాజ్ యువసేన అధ్యక్షులు బైలుర యోగేష్ ప్రభు పేర్కొన్నారు. సోమవారం నాడు కుక్కట్ పల్లి లోని ఆయన స్వగృహంలో చంద్దిప్ప మరకత శివలింగ నామకరణ భక్తుడు, శంకరపల్లి సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్ నరేష్ కుమార్ ను శాలువాతో ప్రభుజి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హిందూ యువకుడు ఒక చత్రపతి శివాజీ లా తయారు కావాలన్నారు. ప్రతి మాతృమూర్తి శివాజీ తల్లి జిజియాబాయిలా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. హిందూ హైందవ గౌరవాన్ని కాపాడడంలో ఎంతకైనా తెగించాలన్నారు. మన భారతదేశం ప్రపంచంలోనే గొప్ప దేశమన్నారు. జూన్ 29 పౌర్ణమి నాడు కృష్ణా పదుకల స్థాపన కోసం గుబ్బడి పతేపురం రావాలని నరేష్ కుమార్ తో పాటు జీఎంకే ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మణికంఠలు ఆహ్వానించడం జరిగింది.

## అసలైన అర్హులకే డబల్ బెడ్ రూమ్ కేటాంపుట జోష్యత



రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :జూన్ 1: అక్షరం న్యూస్ :

పేద ప్రజలకు ప్రభుత్వం అందించాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో నెలకొన్న అవకతవకలు, పారదర్శకత లేకపోవడం మరియు సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ నేడు జనసేన పార్టీ సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు సాయికుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ గత నెలలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల జాబితా, ఎంపిక ప్రక్రియ మరియు ఇతర వివరాలను వెల్లడించాలని సమాచార హక్కు చట్టం (ఆర్ టి ఐ ) కింద మున్సిపల్ కార్యాలయానికి దరఖాస్తు సమర్పించాం. అయితే చట్టప్రకారం నిర్ణీత గడువులో సమాచారం ఇవ్వాల్సిన అధికారులు ఇప్పటివరకు ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడం, మాట దాటవేయడం అత్యంత బాధాకరం మరియు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. దీంట్లో కచ్చితంగా రాజకీయ పరమైన ఒత్తిడి అధికారులపై ఉండి ఉండవచ్చు అని చెప్పారు. ప్రజల హక్కులను కాలరాస్తూ, ప్రభుత్వ కార్యాలయాలను సమాచారాన్ని దాచిపెట్టే కేంద్రాలుగా మార్చడం సరికాదు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అధికారులు బాధ్యతలను విస్మరిస్తే జనసేన పార్టీ మౌనంగా ఉండదు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు అధికారులను హెచ్చరిస్తూ, వెంటనే( ఆర్ టి ఐ) కి సమాధానం ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి మరింత ఉధృతమైన పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాల సమర్పించి, పాదయాత్రగా బాధితులకి తోడుగా జనసేన పార్టీ మున్సిపల్ కార్యాలయానికి చేరి, శాంతియుతంగా తమ నిరసనని తెలియజేశారు...45 గడువు తీసుకున్న తర్వాత మున్సిపల్ కమీషనర్ ఈ విషయం తమ పరిధిలోకి రాదు అని చెప్పడంతో, ఈ విషయం మరి 40 రోజులుగా నాన్చడం ఏంటని సాయికుమార్ గౌడ్ ప్రశ్నించారు. జనసేన పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటుందని సాయికుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సాయికుమార్ గౌడ్ తో పాటుగా దివాకర్, వినోద్, తెలుగు సాయి,శ్రీనివాస్, వెంకటేష్, జశ్వంత్ పాల్గొన్నారు...

## బారాస పార్టీ సమావేశం విజయవంతం కావడంతో ఆందోళనకు గురైన కాంగ్రెస్ నాయకులు



ంకామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/జూన్ 1/అక్షరం న్యూస్:ఎల్లారెడ్డి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం విజయవం తం కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళనకు గురైందనిఎల్లారెడ్డి పట్టణ బి ఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఆదిమూ లం సతీష్ కుమార్ ఆరోపించారు.సోమ వారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని స్థానిక మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఫామ్ వద్ద విలే కరుల సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 30 న ఎల్లారెడ్డి నియోజకవర్గ స్థాయి బారాస పార్టీ సమావేశం విజయవంతం కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీలో గుబులు ప్రారంభ మైందనీ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కొందరు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి మాట్లాడిన విషయాలను ఆయన తీ వ్రంగా ఖండించారు. బారాస సమావేశంలో 100 నుండి150 మంది కంటే ఎక్కువ కా ర్యకర్తలు పాల్గొనలేదని విలేకరుల సాక్షిగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చెప్పడంతో కచ్చి తంగా అధికార కాంగ్రెస్ పార్టీకి భయం మొ దలైందని ఆయన అన్నారు. బారాస సమా వేశంలో ఎంతమంది పాల్గొన్నారనే విష యం ఫోటోలు చూస్తేనే అర్థమవుతుందని అన్నారు.వరి ధాన్యం సేకరణలో తీవ్రమైన జాప్యం ఏర్పడుతుందని, రైతులు పండించి నవరిధాన్యాన్ని అధికారకాంగ్రెస్ ప్రభుత్వం రైస్ మిల్లులకుతరలించడంలో తీవ్రజాప్యం చేస్తుందని, దీనికి నిదర్శనమేఆయా గ్రామా ల రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తేనే తెలిసిపోతుందని ఎద్దేవా చేశారు.ఈ కార్య క్రమంలోబారాస నాయకులు గంగారెడ్డి, ఎ రుకల సాయిలు, ఇమ్రాన్, దయాకర్, దేవ దాస్,బర్కతుల్లాఖాన్,అరవింద్ గౌడ్, బబ్లు, నాగం రాజయ్య, సాయిలు తదితరులు పా ల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



సంగారెడ్డి జిల్లా /నారాయణఖేడ్: కల్హేర్ /జూన్ 1/అక్షరం న్యూస్ :కల్హేర్ మండల కేంద్ర పరిధిలోని మర్డి, బీబీపేట్ గ్రామాల్లో సో మవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు.ఈ సంద ర్భంగా ఏర్పాటుచేసిన రైతు సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, రైతులు తాము పండించిన పంటను దళా రులకు అమ్మి నష్టపోకుండాఉండేందుకే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చే స్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జొన్నలకు క్వింటాలుకు రూ. 3,699మద్దతు ధర కల్పి స్తోందని, రైతులందరూ ఈ అవకాశాన్ని స ద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరా రు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో సొసైటీలలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవినీ తి జరిగాయని మండిపడ్డారు. సొసైటీల ని ర్వహణను పక్కనబెట్టి, కొందరు స్వార్థ ప్ర యోజనాల కోసం అక్రమాలకు పాల్పడటం వల్ల నాడు సామాన్య రైతులు తీవ్ర ఇబ్బం దులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశా రు. రైతుల హక్కులను కాలరాస్తూ, వారిని ఇబ్బందుల పాలు చేసిన నాటి పాలకుల తీరును ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. త మ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి అన్యా యంజరగనివ్వబోమని, ప్రతి గింజనూ మ ద్దతు ధరకే కొనుగోలు చేస్తూ రైతులకు అం డగా ఉంటామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి భ రోసా కల్పించారు.అలాగే గత ప్రభుత్వం లో కేవలం 1 ఒక ఎకరాకు 7 క్వింటాలు మాత్రమే తీసుకున్నారు కానీ మా ప్రభు త్వంలో వచ్చిన నుండి నేను అసెంబ్లీ స మావేశంలో కూడా జొన్నలు ఎకరాకు 20 క్వింటాలు తీసుకోవాలనికోరగా వ్యవసా యశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 14 క్వింటాలకు పెంచడం జరిగిందని అ న్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, వివిధ గ్రామాల సర్పంచ్లు,సొసైటీ చైర్మన్లు,డైరెక్టర్లు, వివిధ శాఖల అధికారు లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్డి, బీబీపేట్ గ్రామాల రైతులు పెద్ద సం ఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాలు

కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/ జూన్ 1/ అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి మండల కేంద్రం లో సోమవారం పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు, ప్రజాప్రతినిధులు అధికారులసమక్షంలోలబ్ధిదారులఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం లో భాగంగా రుద్రారం గ్రామంలో గ్రామ స ర్పంచ్ సందీప్ భగవత్ రెడ్డి సమన్వయం తో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వ హించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మార్కెట్ కమిటీ చై ర్ పర్సన్ రజిత వెంకట్రాంరెడ్డి, ఎంపీడీవో తాహీరా బేగం హాజరయ్యారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మె ల్యే మదన్మోహన్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గానికి3500ఇందిరమ్మఇండ్లుమంజూ రయ్యాయని తెలిపారు.అనంతరం లబ్ధి దారులు మాట్లాడుతూ సొంత ఇంటి నిర్మా ణాన్ని మేము కలలో కూడా అనుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ ద్వారానే మా యొక్క కల నెరవేరిందనిహర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యేకు ప్ర త్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవోతహీరా బేగం, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకట్రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మ న్ వెంకట్ రామ్ రెడ్డి తదితరులు ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయ కులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరు లు పాల్గొన్నారు.



## ఓదెల మండలానికి నాలుగు ప్రీ ప్రైమరీ పాఠశాలల మంజూరు ఎంఈఓ



ఓదెల/ పెద్దపల్లి జూన్ 01 (అక్షరం న్యూస్)

2026 27 విద్యా సంవత్సరానికి ఓదెల మండలంలోని పెద్దకొమర, ఇందుర్తి ,తారకరామా కాలనీ ఓదెల, మరియు పిట్టల ఎల్లయ్యపల్లి నాలుగు గ్రామాలకు మంజూరు కావడం జరిగిందని మండలం విద్యాధికారి వై వి రమేష్ పేర్కొన్నారు . ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూమండలంలో నూతనంగా నాలుగు ప్రైమరీ పాఠశాలలు మంజూరు కావడం జరిగిందని 2025 26 విద్యా సంవత్సరానికి (1)కొలనూరు ఎస్సీ కాలనీ పాఠశాలకు మరియు(2) పుత్కపల్లి ప్రాథమిక పాఠశాలకు రెండు ప్రీ ప్రైమరీ స్కూళ్లు మంజూరు కాబడి నడుస్తున్నాయి. దీనితో మొత్తం మండలంలో ఆరు ప్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూరైనట్లు. తెలిపారు అదే విధంగాప్రభుత్వము ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం కోసం ప్రభుత్వం పాఠశాలకు అనుగుణంగా ప్రీ ప్రైమరీ పాఠశాలను కూడా మంజూరు చేస్తున్నాయి. కొత్తగా ఏర్పాటు కాబోతున్న పాఠశాలకు ఒక బోధకురాలు మరియు ఒక వ్యక్తి నియమించాల్సి ఉంది త్వరలో పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయడం జరుగుతుంది. పేర్కొన్నారుదీనికి ప్రత్యేకతఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకు కూడా యూనిఫార్మ్ , బ్రేక్ఫాస్ట్ ,మిడ్ డే మిల్స్ ఇవ్వబడతాయి. ఆటపాటలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు బోధన చేయబడుతుంది. పాఠశాలకు అవసరమైన బోధనోపకరణాలు, ఆట వస్తువులు, అదనపు తరగతి గదులు త్వరలో మంజూరు అవుతాయి. మన మండలంలోని ఆరు ప్రీ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్పించవలసినదిగా మండలంలోని ప్రజలను కోరుచున్నాను. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోపరుచుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేసిన వై రమేష్

## చాక్ పీస్ పై తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని చెక్కిన సూక్ష్మ కళాకారుడు రజనీకాంత్





ఓదెల /పెద్దపల్లి జూన్01(అక్షరం న్యూస్)

ఓదెల మండలంలోని మడక గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని చాక్ పీస్ పై 2.7 మిల్లీమీటర్ల ఎత్తు మరియు 0.6 మిల్లీమీటర్ల వెడల్పు ఉన్నటువంటి తెలంగాణ అమరవీరుల సుఖాన్ని గోటిపై పెట్టే అంత సూక్ష్మ పరిమాణంలో సుమారు మూడు గంటలు పాటు శ్రమించి తయారు చేసి రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తన సూక్ష్మ కళ ద్వారా తెలియజేశారు ఈ సందర్భంగా సూక్ష్మ కళాకారుడు ఆడెపు రజనీకాంత్ మీడియాతో మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కొరకు అమరులైన ప్రాణాలర్పించిన వారికి ప్రతీక గా నిలిచే తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని చాక్ పీస్ పై 2.7 మిల్లీమీటర్లు ఎత్తు మరియు 0.6 మిల్లీమీటర్లు వెడల్పు ఉన్నటువంటి తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని గోటిపై పట్టే అంత సూక్ష్మ పరిమాణంలో సుమారు మూడు గంటల పాటు శ్రమించి తయారుచేసి రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తన సూక్ష్మ కల ద్వారా తెలియజేయడం చాలా సంతోషంగా ఉందని అదేవిధంగా గతంలో కూడా ప్రపంచంలోనే అతి చిన్న భారత జాతీయ పతాకాన్ని పెన్సిల్ గ్రాఫైట్ పై రూపొందించి క్రెడిన్సు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు సంపాదించుకోవడం జరిగిందని మరియు సబ్బు బిళ్ళపై ,క్యారెట్ పై మరియు ఆలుగడ్డపై చాక్పీసులపై వివిధ పరిమాణాల్లో తెలంగాణ అమరుల స్థూపాన్ని చెక్కి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రాష్ట్రఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినందుకు సంతోషంగా ఉందని ఆడెపు రజనీకాంత్ తెలిపారు

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



యాదాద్రి భువనగిరి జిల్లా /యాదగిరిగుట్ట /అక్షరం న్యూస్ : జూన్ 01 : ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన గడ్డం అనసూయ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత 50 కిలోల బియ్యాన్ని అదేవిధంగా ఐదో వార్డు కౌన్సిలర్ బిట్టు సరోజ హరీష్ ఐదు వేల రూపాయలని ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో యాదగిరిగుట్ట టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ గౌడ్ , కార్యదర్శి ములుగు నరసింహ, రెండో వార్డ్ కౌన్సిలర్ బూడిద మధు, చింతకింది రాజు , విజయ్ , గోపగాని శ్రీధర్ తదితరులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గొంగిడి సునిత



యాదాద్రి భువనగిరి జిల్లా /యాదగిరిగుట్ట /అక్షరం న్యూస్ : జూన్ 01 : యాదగిరిగుట్ట మండలం, గౌరాయిపల్లి గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి .. ఎర్రవెల్లి మహాదేవులు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థులను అడిగి తెలుసుకొన్నారు.. ఇటీవల ఎర్రవెల్లి రామచంద్రం మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు..

## ఇంటర్ లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**•ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్: డాక్టర్ నిజాం**



కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/ జూన్ 1/ అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంట ర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశా లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిజాం తెలిపారు.10వ త రగతి పరీక్షలో ఉత్తీర్ణులైనవిద్యార్థులకు మె రిట్ తో పాటురిజర్వేషన్ల ప్రకారం సీట్ల కేటా యింపు జరుగుతుందని అన్నారు. కళాశా లలో ప్రతి తరగతి గదిలో డిజిటల్ ప్యానెల్ ల సౌకర్యం కలిగి ఉందని,ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందని ఇప్పటికే కొందరు విద్యా ర్థులు కళాశాలలో ప్రవేశాలు పొందినట్లు తె లిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యుత్తమమైన, నాణ్యమైన ఉచిత విద్య ను అందించడంతోపాటు విద్యార్థులకు ఉ దయంఅల్పాహారముపాలు,మధ్యాహ్న భో జనంఈవిద్యాసంవత్సరంనుండిప్రారంభంకాబోతున్నట్టుగా తెలిపారు .విద్యార్థుల స ర్వతోముఖాభివృద్ధికి అధ్యాపకులందరూ కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ అవకాశా న్ని పరిసర ప్రాంతాల విద్యార్థిని విద్యార్థు లు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

## మదర్ డైరీ చైర్మన్ గా ఐలి. కృష్ణ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నిక



యాదాద్రి భువనగిరి జిల్లా /యాదగిరిగుట్ట /అక్షరం న్యూస్ : జూన్ 01 : ఆలేరు మండలం కొల్లూరు గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం మదర్ డైరీ నూతన చైర్మన్గా ఐలి కృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రోజున కొల్లూరు పాల సంఘ భవనంలో పాల ఉత్పత్తిదారులు సంఘ డైరెక్టర్లు సమావేశమై ఐలి. కృష్ణ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తాననితెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నిక కు సహకరించిన సంఘ డైరెక్టర్లకు పాడి రైతులకు కృతజ్ఞతలు తెలిపారు...

## నీ కెప్టెన్సీకి ఓ దండం రా బాబు..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 లో రాయల్ ఛాలెంజర్స్ బెంగ ళూరు వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 18 ఏళ్ల సుదీర్ఘ విరామానికి తెర దించుతూ గత సీజన్‌లో ఆర్సీబీ తొలిసారి టైటిల్ నెగ్గింది. ఇక ఈ సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి టైటిల్‌ను కాపాడుకుంది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో గుజరాత్ టైటాన్స్‌పై ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఫలితంగా ఐపీఎల్ టైటిల్‌ను వరుసగా రెండోసారి ముద్దాడింది. చెన్నై సూపర్ కింగ్స్ (2010, 2011), ముంబై ఇండియన్స్ (2019, 2020)ల తర్వాత బ్యాక్ ట్ టు బ్యాక్ ఐపీఎల్ టైటిల్స్ గెలిచిన మూడో జట్టుగా ఆర్సీబీ నిలిచింది. ఫైనల్లో విరాట్ కోహ్లీ 42 బంతుల్లో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.ఈ మ్యాచ్‌కు ముందు కూడా ఫైనల్లో గుజరాత్ టైటాన్స్ గెలుస్తుందని అంతా భావించారు. ఫైనల్ అహ్మదాబాద్‌లో జరుగుతుండటంతో గుజరాత్ టైటాన్స్ జట్టుకు అడ్వాంటేజ్ ఉంటుందని అంతా భావించారు. ఇక అహ్మదాబాద్ గ్రౌండ్‌లో గుజరాత్ బౌలింగ్‌ను ఆడటం అంత సులభం కాదు. ఇక ఫైనల్లో గుజరాత్ టైటాన్స్ గెలిస్తే కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్‌కు లైన్ క్లియర్ అవుతుందని కూడా అంతా భావించారు. వాస్తవంగా ఫైనల్ పోరు బెంగళూరు వేదికగా జరగాల్సి ఉంది. అయితే ఫైనల్‌ను బీసీసీఐ అహ్మదాబాద్‌కు మార్చింది. గుజరాత్ టైటాన్స్ టైటిల్ గెలిచేలా బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుందని కొందరు ఆరోపణలు కూడా చేశారు.శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ టైటిల్ నెగ్గితే.. టీమిండియా కెప్టెన్సీ విషయంలో ఉన్న అడ్డంకులు గిల్‌కు తొలగిపోతాయని అంతా అనుకున్నారు. టి20ల్లో కూడా అతడికి కెప్టెన్సీని కట్టబెడతారంటూ కామెంట్స్ కూడా వినిపించాయి. అయితే ఫైనల్లో మాత్రం అలా జరగలేదు. గ్రౌండ్ అడ్వాంటేజ్ ఉన్నా గుజరాత్ తుస్సుమంది.మైటీ ఆర్సీబీ ముందు చేతులెత్తేసింది. ఇక బిగ్ మ్యాచ్‌ల్లో తాను అస్సలు ఆడనంటూ గిల్ మరోసారి నిరూపించుకున్నాడు. 8 బంతుల్లో 10 పరుగులు చేసిన గిల్ త్వరగా అవుటయ్యాడు.

# ఆత్మకూర్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశం

యాదాద్రి భువనగిరి జిల్లా /యాదగిరిగుట్ట /అక్షరం న్యూస్ : జూన్ 01 : తెలంగాణ రాష్ట్ర



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఇందిరమ్మ ఇళ్లు" కార్యక్రమంలో భాగంగా జూన్ 1న రాష్ట్రవ్యాప్తంగా సామూహిక గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది... ఈ సందర్భంగా ఆత్మకూర్ మండల కేంద్రంలోని 1వ వార్డులో నిర్మించిన లబ్ధిదారుడు ఎండీ సోనీ ఖలీల్ నూతన ఇందిరమ్మ గృహంలో సామూహిక గృహప్రవేశ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు,నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు సోనీ ఖలీల్ మాట్లాడుతూ, తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి సొంతింటి కలను నెరవేర్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డ, తెలంగాణ ప్రభుత్వ విప్ శాసనసభ్యులు బీర్ల ఐలయ్య తో పాటు స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు అనంతరం నాయకులు మాట్లాడుతూ, పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సొంత ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొంటూ, పేద ప్రజలకు సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవానికి ప్రతీక అని, లబ్ధిదారులు కొత్త ఇంటిలో ఆనందంగా జీవనం ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు. అలాగే మండల కేంద్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎండీవో రాములు నాయక్, స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బీసు చందర్, బీజేపీ మండల అధ్యక్షులు గజరాజు కాశినాథ్, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, సెక్రటరీ అంబోజు శేఖర్, ఉప సర్పంచ్ మజ్జిగ నరేశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రంగ స్వప్న-స్వామి, తవిటి వనజ, పైళ్ల దామోదర్ రెడ్డి, వేముల గణేష్, వార్డు సభ్యులు బూడిద శేఖర్, రాగటి మత్స్యగిరి, లోడి శ్రీను, నాయకులు మజ్జిగ నర్సయ్య,ఎద్దు వెంకన్న, పోతగని మల్లేష్, ఎలిమినేటి స్వామి గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు....



## రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడి పిలుపు ఇవ్వడంతో మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు




ఓదెల /పెద్దపల్లి జూన్01(అక్షరం న్యూస్)

మాజీ సర్పంచుల రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడికి పిలుపునిచ్చిన సందర్భంగా ఓదెల మండలంలోని ఉప్పరపల్లి మాజీ సర్పంచ్ గూడెం మాజీ సర్పంచ్. బాయమ్మపల్లి మాజీ సర్పంచ్ లను ముందస్తుగా అరెస్ట్ చేశారు ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచులు మాట్లాడుతూ మేము సర్పంచ్ గా ఉన్న కాలంలో ఎన్నో అప్పులు చేసే అభివృద్ధి పనులు చేశామని ఆ అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లులు మిగిలిపోయాయని వాటిని ఎప్పటినుండో ఇవ్వాలని ఈ ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందని కానీ దానికి ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదని కష్టపడి కలెక్టర్ ఆదేశాలతో గ్రామాలలో అనేకమైన అప్పులు చేసే అభివృద్ధి పనులు చేశామని మా డబ్బులు మాకు ఇవ్వమని అడిగితే ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తుందని దానికి నిదర్శనగా రాష్ట్ర మాజీ సర్పంచ్ల ఫోరం ఆధ్వర్యంలో సీఎం ఇంటి ముట్టడికి పిలుపునివ్వడంతో మమ్ములను నిర్ధాక్షణంగా అరెస్టు చేయడం సరి అయినది కాదని కష్టపడి అప్పులు తెచ్చి పనిచేసిన మాకు దుఃఖమే మిగిలిందని అప్పుల వారు ఇంటికొచ్చి గొడవలు చేస్తున్నారని మా బిల్లును మాకు ఇవ్వకుంటే మా పరిస్థితులు మా కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఏర్పడుతుందని మా బిల్లులు మాకు ఇవ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో మాజీ గూడెం సర్పంచ్ ఎల్ల స్వామి భయమాపల్లి మాజీ సర్పంచ్ కొమురయ్య ఉప్పరపల్లి మాజీ సర్పంచ్ పల్లె ఓదెలు ఉన్నారు

# 12వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమ త్యాగాలను స్మరించుకుందాం

ఓదెల/ పెద్దపల్లి జూన్ 01(అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి 12 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో విశేష కృషి చేసిన ఉద్యమ యోధులను ప్రజలు స్మరించుకుంటున్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సాగిన మహా ఉద్యమంలో ఓదెల మండలం కీలక పాత్ర పోషించగా, ఉద్యమ కార్యక్రమాల్లో ముందుండి నాయ కత్వం వహించిన ప్ర ముఖ ఉద్యమ కారుడు గుండేటి ఐలయ్య యాదవ్ సేవలను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు.తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగిన రోజుల్లో ఓదెల మండలంలోని యువత, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులను ఉద్యమబాట పట్టించి, రైలు రోకో, రాస్తా రోకో, ధర్నాలు, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయడంలో గుండేటి ఐలయ్య యాదవ్ కీలక పాత్ర పోషించారు. ఉద్యమ పిలుపు వచ్చిన ప్రతిసారీ ప్రజలను సమీకరించి తెలంగాణ ఆకాంక్షను బలంగా వినిపించడంలో ఆయన అగ్రగామిగా నిలిచారు.రైలు రోకో కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులతో కలిసి పోరాటం చేశారు. ఉద్యమ సమయంలో ఎదురైన కేసులు, అరెస్టులు, ఇబ్బందులను లెక్కచేయకుండా తెలంగాణ సాధనే లక్ష్యంగా కృషి చేశారు. ఆయనతో పాటు అనేక మంది ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.ప్రస్తుతం తెలంగాణ ఉద్యమకారుల హక్కులు, గుర్తింపు, గౌరవం కోసం తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ద్వారా గుండేటి ఐలయ్య యాదవ్ నిరంతరం కృషి చేస్తూ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. ఉద్యమకారుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, చరిత్ర పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.12వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమరవీరుల త్యాగాలను




స్మరించుకుంటూ, ఉద్యమకారుల ఆశయాలకు అనుగుణంగా బంగారు తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుండేటి ఐలయ్య యాదవ్ పిలుపునిచ్చారు."తెలంగాణ వచ్చింది కాదు... తెచ్చుకున్నాం. ఆ పోరాట గాథను, ఉద్యమకారుల త్యాగాలను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరువదు" అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో బలమైన ఉద్యమాలు జరుగుతున్న సమయంలో గుండేటి ఐలయ్య ఎక్కడుంటే అక్కడే ఒక సైన్యాన్ని ఏర్పాటు చేసి తనదైన శైలిలో తెలంగాణ ఉద్యమ పోరును నడిపించారని తనతోపాటు మండలంలో అనేకమంది తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేశారని రైల్వే లైన్ పై టెంటు వేసి సహబంతి భోజనం ఎడ్లపండితో నిరసన అనేక ఉద్యమాలతోటే తెలంగాణ ఉద్యమం కొవ్వొత్తున లేచిందని తన చేసిన త్యాగం ఊరికనే పోలేదని తన చేసిన తాగే ఫలితమే తెలంగాణ సహకారం అయిందని పేర్కొన్నారు




# అమరుల త్యాగఫలమే తెలంగాణ రాష్ట్రం

**•తెలంగాణ అమరవీరులకు కొవ్వొత్తులతో ఘన నివాళి**

ఓదెల/ పెద్దపల్లి జూన్01(అక్షరం న్యూస్)

ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేస్తాం : గుండేటి ఐలయ్య యాదవ్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓదెల మండలం కొలనూర్ రైల్వే గేట్ వద్ద తెలంగాణ అమరవీరులకు కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళు లర్పించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్.ఈ సందర్భంగా ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేది ఒక రోజు లేదా ఒక నాయకుడి వల్ల ఏర్పడినది కాదని, వేలాది మంది విద్యార్థులు, జర్నలిస్ట్ లు, యువకులు, ఉద్యోగులు, నాలుగు కోట్ల ప్రజల సహకారం మరియు తెలంగాణ అమరవీరుల త్యాగాలు, ఆత్మబలిదానాల ఫలితంగా సాధించుకున్న రాష్ట్రం అని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమంలో అనేక మంది విద్యార్థులు తమ ప్రాణాలను అర్పించారని, వారి కుటుంబాల బాధను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరువలేదని అన్నారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడు ఎన్నో కష్టనష్టాలు, అరెస్టులు, కేసులు, లాఠీచార్జీలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.కొలనూర్ రైల్వే గేట్ తెలంగాణ ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగి ఉందని, ఉద్యమ ఉధృత సమయంలో నిర్వహించిన రైలు



రోకో కార్యక్రమాలు తెలంగాణ ఆకాంక్షను దేశవ్యాప్తంగా చాటిచెప్పాయని తెలిపారు. అలాంటి చారిత్రాత్మక ప్రదేశంలో అమరవీరులను స్మరించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు.రేపు జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి తెలంగాణ బిడ్డ అమరవీరులను స్మరించుకోవాలని, వారి ఆశయాలకు అనుగుణంగా సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆత్మబలిదానాలు, ఉద్యమకారుల అనితర సాధ్యమైన పోరాటాల వల్లే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని స్పష్టం చేశారు.ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని, ఉద్యమకారులకు గుర్తింపు, గౌరవం, సంక్షేమం కల్పించే దిశగా కృషి కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం తెలంగాణ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాల మౌనం పాటించి ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ నాయకులు సాతుర్ రాజేశం కందుల అశోక్ పటేల్ వేల్పుల కుమార్ యాదవ్ ఇట్టవేణి ఎల్లయ్య మేర శంకరయ్య ఖరక మోహన్ రెడ్డి అంబుల మల్లయ్య గుండెటి రాహుల్ బోయిని కొమురయ్య అంబుల శంకర్ తదితరులు పాల్గొన్నారు...

## గుజరాత్ టైటాన్స్ జట్టుకు త్రుటిలో తప్పిన ప్రమాదం..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో ఓటమి చవిచూసిన గుజరాత్ టైటాన్స్ జట్టుకు కొద్దిసేపటికే ఒక ఊహించని ప్రమాదం ఎదురైంది. ఆదివారం రాత్రి అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం నుంచి మ్యాచ్ ముగించుకుని ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్ హోటల్‌కు తిరిగి వెళ్తుండగా వారి టీమ్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. బస్సులో షార్ట్ సర్క్యూట్ సంభవించడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అయితే, అప్రమత్తమైన సిబ్బంది ఆటగాళ్లందరినీ వెంటనే సురక్షితంగా కిందకు దించేయడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో షార్ట్ సర్క్యూట్ అవ్వడం వల్ల క్షణాల వ్యవధిలోనే లోపల దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది వాహనం నుండి కిందకు దిగి ప్రాణాలు దక్కించుకున్నారు.



ప్రమాదం జరిగిన వెంటనే ప్రత్యామ్నాయ బస్సు అందుబాటులో లేకపోవడంతో శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు దాదాపు గంటపాటు రోడ్డుపైనే వేచి చూడాల్సి వచ్చింది. ఆ తర్వాత ఫ్రాంచైజీ యాజమాన్యం వేరే బస్సును ఏర్పాటు చేయడంతో అందరూ సురక్షితంగా హోటల్‌కు చేరుకున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, అందరూ క్షేమంగా ఉన్నారని అధికారులు ధృవీకరించారు. ఐపీఎల్ 2026 ఫైనల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో గుజరాత్ టైటాన్స్ 5 వికెట్ల తేడాతో ఓటమి పాలైన సంగతి తెలిసిందే. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ కేవలం 155/8 పరుగులకే పరిమితమవగా.. ఆర్సీబీ ఆ లక్ష్యాన్ని ఛేదించి వరుసగా రెండో ఏడాది కూడా ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకుంది. మైదానంలో ఓటమి బాధతో ఉన్న టైటాన్స్ జట్టుకు, ఈ బస్సు ప్రమాదం మరింత ఆందోళన కలిగించింది. గత కొద్దిరోజులుగా గుజరాత్ టైటాన్స్ జట్టుకు ప్రయాణ షెడ్యూల్ చాలా భారంగా మారింది. మే 26న ధర్మశాలలో ఆర్సీబీతో క్వాలిఫైయర్-1 ఆడిన జట్టు, ఆ తర్వాత రాజస్థాన్ రాయల్స్‌తో క్వాలిఫైయర్-2 ఆడేందుకు మే 27న ముల్లాన్‌పూర్‌కు ప్రయాణమైంది. అక్కడ మే 29న మ్యాచ్ ముగిశాక, మే 30న అహ్మదాబాద్ బయలుదేరాల్సి ఉండగా.. ప్రతికూల వాతావరణం వల్ల వారి చార్టర్డ్ ఫ్లైట్ దాదాపు మూడు గంటలు ఆలస్యమైంది. దీనివల్ల శనివారం అర్ధరాత్రి మాత్రమే వారు అహ్మదాబాద్ చేరుకోగలిగారు. ఈ విపరీతమైన అలసట వల్లే ఫైనల్‌లో జట్టు ఘోరంగా విఫలమైందా? అని మ్యాచ్ అనంతరం విలేకరులు ప్రశ్నించగా.. గుజరాత్ టైటాన్స్ క్రికెట్ డైరెక్టర్ విక్రమ్ సోలంకి ఆ నెపాన్ని షెడ్యూల్‌పైకి నెట్టడానికి నిరాకరించారు. "ఆర్సీబీ చాలా బాగా ఆడి గెలిచింది. వరుస మ్యాచ్‌ల వల్ల మేము అలసిపోయామని చెప్పి వారి గెలుపు క్రెడిట్‌ను తగ్గించలేము. మా స్కోరు తక్కువైనప్పటికీ మా బౌలర్లు పోరాడారు'' అని సోలంకి వ్యాఖ్యానించారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609